## రాంబాబు సేవలు అభినందనీయం : కలెక్టర్

**ప్రజాశక్తి - భీమవరం**

అర్జీదారులకు మళ్ల రాంబాబు భోజనం ఏర్పాటు అభినందనీయమని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ప్రతి సోమవారమూ జిల్లా కలెక్టరేట్‌లో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలను సమర్పించేందుకు జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చే ప్రజలకు వీరవాసరం ప్రాంతానికి చెందిన మళ్ల రాంబాబు రుచికరమైన భోజనాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రతి సోమవారమూ సుదీర్ఘ ప్రాంతాల నుండి తమ సమస్యలను పిజిఆర్‌ఎస్ ద్వారా పరిష్కారం కోసం వచ్చే సుమారు 200 మంది ప్రజలకు రాంబాబు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భోజనాన్ని ఉచితంగా అర్జీదారులకు పెట్టడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ ఆహార పదార్థాలను స్వయంగా పరిశీలించి, భోజనం చేస్తున్న అర్జీదారులను భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు.

ఆకివీడులో..

పెంటపాడులో..

తణుకులో..

# ఐక్య పోరాటాలతోనే హక్కుల పరిరక్షణ

## సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రాజా రామ్మోహన్‌రాయ్ - వాడవాడలా సిఐటియు పతాకావిష్కరణలు

**ప్రజాశక్తి - భీమవరం**

ఐక్య పోరాటాల ద్వారానే హక్కులు కాపాడుకోగలమని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రాజారామ్మోహన్‌రాయ్ అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద సిఐటియు అఖిలభారత మహాసభ జయప్రదం కోరుతూ సోమవారం సిఐటియు పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈ నెల 31 నుంచి జనవరి 4 వరకు విశాఖలో జరిగే సిఐటియు అఖిలభారత మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ కార్మికవర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను పాలకవర్గాలు, ప్రధానంగా మోడీ ప్రభుత్వం రద్దు చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఐక్య పోరాటాల ద్వారానే కార్మిక హక్కులు కాపాడుకోవాలన్నారు. సులభతర వ్యాపారం పేరుతో కార్మికుల హక్కులు కాలు రాస్తున్న ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తులు రూ.లక్షల కోట్లు బ్యాంకులకు ఎగ్గొడితే వాటిని మోడీ ప్రభుత్వం రద్దు చేస్తుందని, మరోపక్క కార్మికులు ప్రజలపై విపరీతమైన పన్నుల భారం వేస్తున్నాయని విమర్శించారు. రానున్న రోజుల్లో కార్మికుల హక్కుల కోసం పెద్దఎత్తున పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు, నేతలు డి.నాగేశ్వరరావు, అప్పారావు ,నానాజీ పాల్గొన్నారు.

భీమవరంలో..

పెంటపాడులో..

**ఆచంట:** సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం మండలంలో ఆచంట, కొడమంచిలి, వల్లూరు, కందరవల్లి, కరుగోరుమిల్లి, పెనుమంచిలి, వల్లూరు, భీమలాపురం, అయోధ్యలంక, శేషమ్మ చెరువు గ్రామాల్లో వాడవాడల్లో 26 చోట్ల సిఐటియు పతాకాలను ఆవిష్కరించారు. సిఐటియు మండల కన్వీనర్, కోకన్వీనర్ బండి రంగారావు, నేలపాటి విజయలక్ష్మి మాట్లాడగా అంగన్వాడీ నేత వైట్ల ఉషారాణి, పెచ్చెట్టి మసేనమ్మ, కౌరు హైమాభవాని, కాంట్రేగుల సునీత, కేతా ధనలక్ష్మి, కేతా నాగాంజనేయులు, పూసల ఏడుకొండలు, గుత్తుల శ్రీదేవి, కమల, వెంకటలక్ష్మి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**భీమవరం టౌన్:** సిఐటియు అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వెంప గ్రామంలోని బస్టాండ్ సెంటర్ సిఐటియు పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కనుమూరి కృష్ణంరాజు, చిలకపాటి ఆనంద్, వరలక్ష్మి, రామలక్ష్మి, సునీత, వర్ధనపు నరసింహులు పాల్గొన్నారు.

**గణపవరం:** సరిపల్లి గాంధీ నగర్ సెంటర్లో సిఐటియు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా నేత కె.రూన్సీలక్ష్మి, మండల కన్వీనర్ ఎం.పెంటారావు మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

**ఉండి:** మహదేవపట్నంలోని ఎపి బేవరేజెస్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు పతాకావిష్కరణ నిర్వహించారు. సిఐటియు మండల కన్వీనర్ ధనికొండ శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు కొట్లాడ వెంకటేశ్వరరావు, అంగన్వాడీలు కుసుమ, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

**వీరవాసరం:** సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ మండలంలోని వీరవాసరం, మత్స్యపురిపాలెం, మత్స్యపురి, నవుడూరు, ఉత్తరపాలెం తదితర గ్రామాలలో పతాకాలను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో మధ్యాహ్న భోజనం, ఆశ, అంగన్వాడీ, విఒఎ, భవన నిర్మాణం, రైస్ మిల్లు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడారు.

**తాడేపల్లిగూడెం:** సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక తాలూకా రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద సిఐటియు పతాకాన్ని సిఐటియు జిల్లా అధ్యక్షులు కర్రి నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావుతోపాటు యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు సత్తి కొండలరామిరెడ్డి, చిర్ల పుల్లారెడ్డి మాట్లాడారు. జనవరి 4న విశాఖపట్టంలో జరిగే బహిరంగ సభకు వందలాది మంది తరలివెళ్లనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కర్రి సాయిరెడ్డి, ఎస్ఎస్ రెడ్డి, కర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఆకుల నారాయణ, కర్రి సుబ్బిరెడ్డి, ఆడపా ఆంజనేయులు, గాది వెంకట్రావు, బుద్దాల నాని, మద్దాల పుల్లయ్య అడ్డగర్ల కృష్ణ పాల్గొన్నారు. స్థానిక ఉల్లిపాయల మార్కెట్ వర్కర్స్ యూనియన్ ఆఫీస్ వద్ద సిఐటియు పతాకాన్ని ఉల్లిపాయల మార్కెట్ ప్రెసిడెంట్ చల్లా చంద్రరావు ఆవిష్కరించారు. అల్లు సుబ్బారావు, కరక వెంకట్రావు, సిరపు గణేష్, బర్ల బాలాజీ, దొర్ల సీతయ్య, వెన్నెల శ్రీను, చీర వెంకన్న, సలుమూరి సత్యనారాయణ, గోర్ల రమేష్, సిరపు మహేష్ బేతా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలోని అన్ని మస్టర్ పాయింట్ల వద్ద సిఐటియు పతాకాలను ఎపి మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. తొలుత మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు జెండాను యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ధనాల వెంకట్రావు ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు అపరిష్కృతంగానే ఉన్నాయన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కర్రి నాగేశ్వరరావు, నేతలు తాడికొండ జయరామకృష్ణ, కొడమంచిలి బాబు, ధనాల రాజు, తాడికొండ శ్రీను, సోమరిపేట సతీష్ కుమార్, కొడమంచిలి ప్రసాద్, ధనాల దానయ్య కార్మికులు పాల్గొన్నారు.

**పెంటపాడు:** ప్రజాసంఘాల కార్యాలయం వద్ద సిఐటియు పతాకాన్ని సిఐటియా జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు ఆవిష్కరించారు. రంగారావు, చిర్ల పుల్లారెడ్డి, బంకురు నాగేశ్వరరావు మాట్లాడగా, బర్ల బాలాజీ, దత్తు రాము, పెనగంటి దుర్గా, వీరభత్తుల రాంబాబు, మాదాసు రాజు, గంట కోటి, బొడ్డపాటి శివ, పూడి బాలాజీ, బత్తిరెడ్డి రాంబాబు పాల్గొన్నారు.

**పెనుగొండ:** మండలంలోని 13 గ్రామాల్లో సిఐటియు జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అఖిల భారత మహాసభకు కార్మికులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షులు కామారి తులసి, నాయకులు పులిదిండి రామారావు, షేక్ పాదుషా తదితరులు పాల్గొన్నారు.

**ఆకివీడు:** లేబర్ కోడ్‌ల ప్రమాదంపై పూర్తిస్థాయిలో ప్రచారం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జెఎన్.వి.గోపాలన్ పిలుపునిచ్చారు. సిఐటియు పతాకావిష్కరణ స్థానిక ఐ.భీమవరం రోడ్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయన్నారు. విశాఖ మహాసభతో కార్మికోద్యమం మరింత ఉధృతమవుతుందన్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ బి.రాంబాబు, కోకన్వీనర్లు కె.తవిటి నాయుడు, పెంకి అప్పారావు, నేతలు బుర్ర శ్రీను, టి.కృష్ణ, మణిపూరి సత్యనారాయణ, ప్రవీణ్, ఎం.సతీష్, సందక సూరిబాబు, డోకల రవితేజ పాల్గొన్నారు.

**తణుకు:** కార్మికుల సమస్యలపై విశాఖ మహాసభలో విస్తృతంగా చర్చించనున్నట్లు సిఐటియు జిల్లా కార్యదర్శి పి.వి.ప్రతాప్ అన్నారు. సోమవారం పట్టణంలో సంఘం ఆధ్వర్యాన పలుచోట్ల సిఐటియు పతాకాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో నేతలు అడగర్ల అజయకుమారి, గార రంగారావు, అంబటి రామకృష్ణ, ఎస్.ఆది నారాయణబాబు, కృష్ణబాబు, అయ్యప్ప, గంగాధర్, నాగేంద్ర కుమార్, మంగమ్మ, రాణి, జ్యోతిబాబు, శారద, సత్యవతి, ఎన్.శ్రీనివాస్, సుధాకర్, ఎన్.చిన్నారావు, నాగబాబు, మధుబాల, కనకదుర్గ, విజయానంద కుమారి, అనిత, సుబ్బలక్ష్మి, పి.ఉష పాల్గొన్నారు.

**వేల్పూరు:** వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు పతాకాన్ని యూనియన్ అధ్యక్షులు నాగేశ్వరరావు ఆవిష్కరించారు. యూనియన్ గౌరవాధ్యక్షులు బళ్ల చిన వీరభద్రరావు మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు సొరపల్లి రామకృష్ణ, వాసా వెంకటేశ్వరరావు, తాతారావు, గాడి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

**కాళ్ల:** సిఐటియు అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని జిల్లా నాయకులు గొర్ల రామకృష్ణ అన్నారు. స్థానిక బస్టాండ్ సెంటర్ వద్ద సిఐటియు పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఋద్రిరాజు ఏడుకొండలు, కార్మికులు పాల్గొన్నారు.

**పెనుమంట్ర:** మండలంలోని పలు గ్రామాల్లో సిఐటియు పతాకాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ చిత్తరంజన్, కోకన్వీనర్ ప్రశాంతి, రైతుసంఘం నాయకులు కె.సుబ్బరాజు, ప్రసాద్, ఆంజనేయులు, శ్రీరామచంద్రమూర్తి, లక్ష్మణరావు పాల్గొన్నారు.

**యలమంచిలి:** మండలంలోని గుంపర్రు, అబ్బిరాజుపాలెం, దొడ్డిపట్ల, కట్టుపాలెం, మేడపాడు, కొంతేరు, ఏనుగువానిలంక, బాడవ గ్రామాల్లో సోమవారం సిఐటియు జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి దేవ సుధాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలన్నారు. కార్యక్రమంలో పద్మశ్రీ వెంకటలక్ష్మి, నాగలక్ష్మి, సుమ, సందీప్, కుమారి, సూర్యావతి, నాగమ్మ, చిన్ని తల్లి, కుమారి, శ్రీవర్ధిని, సుజాత, ఇంద్రాణి, మాణిక్యమ్మ, వాణి పాల్గొన్నారు.

# కోస్తా అభివృద్ధికి వందేభారత్ దోహదం

## కేంద్ర మంత్రి వర్మ - నరసాపురం నుంచి చెన్నయ్ వందేభారత్ రైలు ప్రారంభం

**ప్రజాశక్తి - నరసాపురం**

వందేభారత్ రైలు కోస్తా ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. సోమవారం నరసాపురం రైల్వే స్టేషన్ నుండి వందే భారత్ రైలును ఆయన లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు, కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి, ప్రభుత్వ విప్‌లు బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, పిఎసి ఛైర్మన్ పులపర్తి రామాంజనేయులు, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, రాష్ట్ర మహిళా ఆర్థిక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పీతల సుజాత, మైనార్టీ కార్పొరేషన్ ఛైర్మన్ షరీఫ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ మాట్లాడుతూ విద్యార్థులకు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు ఈ రైలు బాగా ఉపయోగపడుతుందన్నారు. హైదరాబాద్, బెంగళూరు వెళ్లే వందేభారత్ రైలు కూడా నరసాపురం వచ్చి వెళ్లేలా సంబంధిత కేంద్ర మంత్రి, అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్ నుండి విశాఖపట్నం వెళ్లే వందే భారత్ రైలు తాడేపల్లిగూడెంలో ఆగేలా ఏర్పాటు చేస్తానన్నారు. తాడేపల్లిగూడెంలో ఆర్‌యుబిలు నిర్మాణంలో ఉన్నాయన్నారు. తొలుత జనసేన కార్యాలయం నుండి పట్టణంలోని పలు వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌సి రైల్వే అడిషనల్ జనరల్ మేనేజర్ సత్యప్రకాష్, గుడివాడ ఎంఎల్‌ఎ వెనిగండ్ల రాము, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, మాజీ ఎంఎల్‌ఎలు బండారు మాధవ నాయుడు, కొత్తపల్లి జానకిరామ్, ఆర్‌డిఒ దాసిరాజు, విజయవాడ డిఆర్‌ఎం మోహిత్ సోనాక్య, ఎడిఆర్‌ఎం ఆపరేషన్స్ కొండా శ్రీనివాసరావు, చీఫ్ పిఆర్‌ఓ శ్రీధర్, తహశీల్దార్ ఐయితం సత్యనారాయణ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రె శ్రీ వెంకటరమణ పాల్గొన్నారు.

రైలులో ప్రయాణిస్తున్న మంత్రులు శ్రీనివాస వర్మ, నిమ్మల రామానాయుడు, కలెక్టర్

# ఉద్యమాల ముద్దుబిడ్డ షేక్ సాబ్జీ

## పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి

**ప్రజాశక్తి - భీమవరం**

ఉద్యమాల ముద్దుబిడ్డ, మాజీ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపిమూర్తి అన్నారు. స్థానిక పిడిఎఫ్ కార్యాలయంలో సాబ్జీ రెండో వర్ధంతి సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంఎల్‌సి గోపిమూర్తి, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రాజారామ్మోహన్‌రాయ్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గోపిమూర్తి మాట్లాడుతూ జిల్లా ఉపాధ్యాయ ఉద్యమంలో సాబ్జీ కృషి ఎనలేనిదన్నారు. పిడిఎఫ్ ఎంఎల్‌సిగా ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక కర్షక సామాన్య ప్రజానీక సమస్యల పరిష్కారానికి శాసనమండలిలో తన వాణి విన్పించారని గుర్తు చేశారు. ఆయన ఆశయానికి అనుగుణంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని, అదే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు.

షాబ్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గోపీమూర్తి

# యానిమేటర్ల అవినీతిపై దర్యాప్తు చేయాలి

## బాధిత మహిళలకు న్యాయం చేయాలి

## కలెక్టరేట్ వద్ద ఐద్వా ఆధ్వర్యాన బాధితుల ధర్నా

**ప్రజాశక్తి - భీమవరం**

ఆకివీడులో డ్వాక్రా యానిమేటర్ల అవినీతిపై వెంటనే స్పందించి దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద ఐద్వా ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షులు ఎస్.ఉదయ్‌కుమారి మాట్లాడుతూ ఆకివీడు నగర పంచాయతీ పరిధిలో మార్కెట్, సమతానగర్లో డ్వాక్రా యానిమేటర్లు సుమారు రూ.రెండు కోట్లు వరకు అవినీతి చేశారన్నారు. ఈ సంఘాల్లో అందరూ పేదవారే ఉన్నారన్నారు. రోజువారీ పనులకు వెళ్తూ డ్వాక్రా కట్టుకుంటూ బతుకుతున్నారన్నారు. కొంతమంది డ్వాక్రా సంఘాల ద్వారా వచ్చిన సొమ్ముతో చిన్న చిన్న వ్యాపారాలు కూడా చేసుకుంటున్నారని తెలిపారు. అయితే వీరికి సరైన చదువులేకపోవడం వల్ల యానిమేటర్లు చెప్పింది వేదంగా నమ్మి ముందుకు వెళ్లారన్నారు. ఎన్ని సంవత్సరాలు కట్టినా అప్పు తీరకపోవడంతో గట్టిగా అడిగేసరికి పరారయ్యారన్నారు. వెంటనే ఐద్వా ఆధ్వర్యాన సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. సొమ్ము కాజేసిన వారిని పట్టుకుని దర్యాప్తు చేసి అందరికీ న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో కె.పద్మ, డి.కళ్యాణి, సరోజ, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

కలెక్టర్ వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

# ఘనంగా బాపు జయంతి వేడుకలు

**ప్రజాశక్తి - నరసాపురం**

సినీ దర్శకుడు, చిత్రకారుడు బాపు జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. లలితాంబ రేవులో బాపు విగ్రహానికి డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మాజీ ఎంఎల్‌ఎ బండారు మాధవనాయుడు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రఘు రామకృష్ణంరాజు మాట్లాడుతూ బాపు బొమ్మల ద్వారా తెలుగుదనాన్ని ప్రపంచానికి పరిచయం చేశారని కొనియాడారు. తెలుగుదనానికి నిలువెత్తు నిదర్శనం బాపు అన్నారు. భవిష్యత్తులో అంతా కలిసి బాపు జయంతి వేడుకలు జరుపుతామన్నారు. దీనికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

బాపు విగ్రహానికి పూలమాలల వేస్తున్న రఘు రామకృష్ణరాజు, మాధవనాయుడు

# అర్జీలు సకాలంలో పరిష్కరించాలి : కలెక్టర్

**ప్రజాశక్తి - భీమవరం**

పిజిఆర్‌ఎస్‌కు వచ్చిన వినతులు సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. స్థానిక కలెక్టరేట్లో సోమవారం పిజిఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన 197 వినతులను కలెక్టర్ చదలవాడ నాగరాణితో పాటు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి, డిఆర్‌ఒ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పీడీ కెసిహెచ్.అప్పారావు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, కలెక్టరేట్ ఎఒ ఎన్.వెంకటేశ్వర్లు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి పిజిఆర్‌ఎస్ సమస్యల పరిష్కారం, ప్రగతిపై సమీక్షించారు. సమస్యలు పరిష్కరించడంలో అధికారులు మరింత శ్రద్ధ చూపాలన్నారు. పిజిఆర్‌ఎస్‌కు వచ్చిన సమస్యలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ప్రతి దరఖాస్తుకూ ప్రాధాన్యతివ్వాలన్నారు. ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకత సమర్థతను పెంచడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, వయో వృద్ధుల సంక్షేమ అప్పీల్లేట్ ట్రిబ్యునల్ మెంబెర్ మేళం దుర్గాప్రసాద్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# 22ఎ భూములకు.. పరిష్కారం దొరికేనా..!

- నేడు ఇన్‌ఛార్జి మంత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రీవెన్స్
- జిల్లావ్యాప్తంగా ఇప్పటికే 200 వరకూ ఫిర్యాదులు పెండింగ్
- ఎన్నోఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న హక్కుదారులు
- అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పరిష్కారం కాని పరిస్థితి
- నోషనల్ ఖాతాల బాధితులు అత్యధికమే
- గ్రీవెన్స్‌పై ప్రజలకు సమాచారం అందజేతలో అధికారులు విఫలం

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

22ఎ భూముల సమస్యలకు ఇప్పటికైనా మోక్షం కలుగుతుందా అనే చర్చ జనాల్లో సాగుతోంది. ఇన్‌ఛార్జి మంత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి జరగనున్న 22ఎ భూముల ప్రత్యేక గ్రీవెన్స్‌పై అంతటా ఆసక్తి నెలకొంది. ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు గురించి ప్రజలకు తెలియపర్చడంలో అధికారులు విఫలమయ్యారు. మీడియా, టాంటాంల ద్వారా తెలియపర్చాలని అనుకున్నా సరైన రీతిలో ప్రచారం మాత్రం జరగలేదు. దీంతో చాలామందికి 22ఎ భూములపై ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహణపై సమాచారం లేకుండా పోయింది. నవంబర్ 26న జరిగిన డిఆర్‌సి సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ చేసిన ప్రకటన తర్వాత అధికారులు ప్రజలకు చేరవేయడంలో ప్రత్యేక చర్యలేమీ తీసుకోని పరిస్థితి కన్పించింది. దీంతో మంగళవారం గ్రీవెన్స్‌కు ఫిర్యాదుదారులు ఎంతమంది వస్తారనే దానిపై సందిగ్ధత నెలకొంది. ఏలూరు జిల్లాలో పెద్దఎత్తున ప్రయివేటు వ్యక్తుల భూములు 22ఎలో ఉన్నట్లు ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. అధికారులు మాత్రం తమ వద్ద దాదాపు 200 ఫిర్యాదులు మాత్రమే ఉన్నట్లు చెబుతున్నారు. అధికారుల లెక్కలకు.. క్షేత్రస్థాయి పరిస్థితికి ఏమాత్రం సంబంధం లేదని గడిచిన డిఆర్‌సి సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. ప్రభుత్వం సైతం 22ఎ భూముల పరిష్కారంపై గట్టిగా ఉండటంతో ఎట్టకేలకు ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన పరిస్థితి ఉంది. 22ఎ సెక్షన్‌లో ఐదు రకాల భూములు ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వ భూములు, కేంద్ర ప్రభుత్వ భూములు, దేవాదాయ, వక్ఫ్ వంటి భూములు, ప్రభుత్వం ప్రజలకిచ్చిన భూములు, చుక్కల భూములు ఈ సెక్షన్‌లో ఉంటాయి. వీటిలో ప్రయివేటు వ్యక్తుల అనుభవంలో ఉండి 22ఎలో ఉన్న భూములను మాత్రం పరిష్కరించడానికి వీలుంటుంది. ఎన్నోఏళ్లుగా తమ అనుభవంలో భూములు ఉన్నప్పటికీ 22ఎలో ఉంటే క్రయ విక్రయాలకు ఏమాత్రం అవకాశం లేకుండాపోతుంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరగదు. దీంతో భూమి ఉన్నప్పటికీ ప్రయోజనం లేని పరిస్థితి ఏర్పడింది. 22ఎ భూములకు సంబంధించి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా పట్టించుకోని పరిస్థితి. దీంతో ఏళ్ల తరబడి సంబంధిత భూయజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 22ఎ భూములు అత్యధికంగా కృష్ణా జిల్లా నుంచి కలిసిన నూజివీడు నియోజకవర్గ పరిధిలో ఉన్నట్లు తెలుస్తోంది. 22ఎ భూములకు సంబంధించి ఫిర్యాదులు ఇచ్చిన తర్వాత పరిష్కారం చూపిస్తారా.. గతంలో మాదిరిగా ఫిర్యాదులు తీసుకుని పక్కన పెట్టేస్తారా అనే అనుమానాలు అందరినీ వెంటాడుతున్నాయి. ఎన్నోఏళ్లుగా తమ అనుభవంలో ఉండి 22ఎలో ఉన్న భూములకు ప్రత్యేక గ్రీవెన్స్ ద్వారా పరిష్కారం దొరికితే రైతులకు ఎంతగానో మేలు జరుగుతుంది. గ్రామాల్లో టాంటాం ద్వారా ప్రచారం చేసి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



**అదే తరహాలో నోషనల్ ఖాతాల భూములు**

22ఎ భూములతోపాటు నోషనల్ ఖాతాలకు సంబంధించిన భూములు జిల్లాలో పెద్దఎత్తున ఉన్నాయి. పిజిఆర్‌ఎస్‌లో ఫిర్యాదులు చేస్తున్నా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. లక్ష సంఖ్యలో నోషనల్ ఖాతా ఉంటే తహశీల్దార్ పరిష్కరించే అవకాశం ఉంటుంది. రెండు లక్షల నెంబర్‌తో నోషనల్ ఖాతా ఉంటే మాత్రం జాయింట్ కలెక్టర్ లాగిన్‌లో మాత్రమే అవుతోంది. దీంతో చాలామంది తమ భూములు నోషనల్ ఖాతాల్లో ఉండటంతో పరిష్కారం కోసం ఎన్నోఏళ్లుగా జనం రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అయినప్పటికీ పరిష్కారం మాత్రం కావడం లేదు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అధికారులకు చిత్తశుద్ధి లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణమనే విమర్శలు సైతం ఉన్నాయి. ప్రత్యేక గ్రీవెన్స్‌లో నోషనల్ ఖాతాల భూసమస్యలను సైతం పరిష్కరిస్తారో.. లేదో వేచిచూడాలి.

# నత్తాలోవ డ్రెయిన్‌ను తవ్వాలని ఆందోళన

**ప్రజాశక్తి - నరసాపురం**

మండలంలోని సరిపల్లి, లిఖితపూడి, రుస్తుంబాద గ్రామాల్లోని పంట పొలాల్లో నీరులాగే ప్రధాన కాలువ నత్తాలోవ డ్రెయిన్‌ను వెంటనే తవ్వాలని రైతులు, కౌలు రైతులు సరిపల్లి వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మాట్లాడుతూ నత్తాలోవ డ్రెయిన్ ఏళ్ల తరబడి తవ్వడంలేదన్నారు. ఈ డ్రెయిన్‌పై మూడు గ్రామాల పరిధిలో వేల ఎకరాల్లో పంట సాగవుతోందని, ఏళ్ల తరబడి కాలువ తవ్వకపోవడంతో ప్రతి సార్వాలో పంట వేయకుండా నిరుపయోగంగా వదిలేసి రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నరన్నారు. వరద సమయంలో పోటు నీరు పొలాల్లోకి వెళ్లి తిరిగి బయటకు లాగక పోవడంతో ప్రస్తుతం దాళ్వా సాగు చేపట్టే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. ప్రభుత్వం, నీటి సంఘాల కమిటీలు పట్టించుకోకపోవడంతో ఇప్పటికే పంట కోల్పోయి కష్టాల్లో ఉన్న రైతులు సొంతంగా చందాలు వేసుకుని కాలువ తవ్వుకునే దుస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వం, నీటి సంఘాలున్నా నిధులు కేటాయించి తవ్వక పోవడం దారుణమన్నారు. సమస్యపై డ్రెయినేజీ డిఇ మోహన్ కృష్ణ, నీటి సంఘం డైరెక్టర్ అందే రామకృష్ణతో మాట్లాడగా వెంటనే వర్క్ అంచనా వేసి తీర్మానం చేసి త్వరలోనే కాలువను తవ్వుతామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు మండా రమేష్, జి.ఏడుకొండలు, జి.నాగేశ్వరరావు, గమిడి మధుబాబు, కె.వెంకటేష్, కర్రి రాంబాబు, యర్రంశెట్టి సత్యనారాయణ, కేదాసు వీరన్న, తణుకుల రాజు, గన్నాబత్తుల నారాయణ పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న రైతులు, కౌలు రైతులు

# సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బలరాం



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బలరాం

ప్రజాశక్తి - పాలకోడేరు

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 18 నెలలు కావస్తున్నా సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమైందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం విమర్శించారు. మోగల్లులో సిపిఎం గ్రామ కమిటీ, సిపిఎం సానుభూతిపరులతో విస్తృత సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అనేక హామీలిచ్చిందని, అయితే వాటిని అమలుచేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. మోగల్లు సుబ్బరాజు చెరువు గట్టు ప్రాంతవాసులకు ప్రత్యామ్నాయం చూపించి గృహాలు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ ప్రాంతంలోనే నివసిస్తున్న వారిని ఆదుకోవాలన్నారు. అలాగే స్థానికంగా నివాసం ఉంటున్న యానాదులకు సరైన సౌకర్యాలు లేవన్నారు. కనీసం ఆ కుటుంబాలకు ఆధార్, రేషన్ కార్డులు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం అధికారులు యానాది కుటుంబాలను ఆదుకోవడంతోపాటు సౌకర్యాలు కల్పించి ఆధార్, రేషన్ కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టిడిపి మండల కార్యదర్శి శేషావు ఆత్రియ, నాయకులు పాల వెంకటస్వామి, నాయకులు కార్యకర్తలు, సానుభూతిపరులు పాల్గొన్నారు.

# మహిళ ఆర్థిక భద్రతే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - ఉండి

మహిళల ఆర్థిక బలోపేతమే ప్రభుత్వ ధ్యేయమని మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు కర్రి జయలక్ష్మి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఉండి గ్రామ పంచాయతీ వద్ద డ్వాక్రా సంఘాలకు మన డబ్బులు మన లెక్కలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయలక్ష్మి శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసి పావలా వడ్డీకే రుణాలు ఇప్పించారని గుర్తు చేశారు. డ్వాక్రా సంఘాల్లో ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ఉండేందుకు నేడు ప్రభుత్వం మన డబ్బులు మన లెక్కలు కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని, ఈ కార్యక్రమం పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. నూతనంగా ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్ ద్వారా ప్రతి సభ్యురాలు తన సెల్ ఫోన్‌లోనే సక్రమంగా నగదు జమ అయిందో లేదో తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ అధ్యక్షురాలు కట్టా సత్యవతి, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు కాగిత మహాలక్ష్మి, డ్వాక్రా సీసీలు యానిమేటర్లు, పలు స్వయం సహాయక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# కోరుమిల్లి సొసైటీలో అందుబాటులో ఎరువులు

ప్రజాశక్తి - పెంటపాడు

మండలంలోని కోరుమిల్లి సొసైటీలో రైతులకు అందుబాటులో ఎరువులు ఉన్నాయని ప్రాథమిక సహకార సంఘం కార్యదర్శి నిమ్మలపూడి జస్వంత్ కుమార్ తెలిపారు. సోమవారం సొసైటీ విలేకరులతో జస్వంత్ మాట్లాడుతూ తమ దగ్గరలో రైతులకు తమ సొసైటీ ద్వారా ఎరువులు అందిస్తున్నామని తెలిపారు. తమ సొసైటీకి తొలి విడతలో 35 టన్నుల ఎరువులు వచ్చాయన్నారు. కోరుమిల్లి సొసైటీ పరిధిలోని కోరుమిల్లి, బి.కొండేపాడు, మీనవల్లూరు గ్రామ రైతులకు ఎరువులు ఇవ్వనున్నట్లు చెప్పారు. తమ సొసైటీ పరిధిలో 80 టన్నులు ఎరువులు అవసరం కాగా తొలి విడత 35 టన్నులు వచ్చాయని తెలిపారు. రెండు రోజుల్లో 25 టన్నులు రానున్నట్లు తెలిపారు. 52 టన్నులు కాంప్లెక్స్, 7 టన్నులు పటాస్ వచ్చిందని అన్నారు. ఎకరానికి నాలుగు బస్తాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

# పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - గణపవరం

ఈ నెల 21, 22, 23వ తేదీల్లో జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని మండల అధికారులు విజయవంతం చేయాలని తహశీల్దార్ వైవి.అప్పారావు, ఎంపిడిఒ ఆర్.జీవీశ్రీలక్ష్మి తెలిపారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన మండల టాస్క్ ఫోర్స్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల వయసు గల పిల్లలకు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలన్నారు. మండల స్థాయి అధికారులందరూ సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది సచివాలయ సిబ్బంది సహకరించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి డాక్టర్ పి.ఓంకార్ నాథ్, సిహెచ్‌ఒ జాలాది విల్సన్‌బాబు, ఎంఇఒ జి.బాలయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. పిప్పర, గణపవరం పిహెచ్‌సి పరిధిలోని పిల్లలకు పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు.



ధర్నా చేస్తున్న బాధితురాలు, కుటుంబ సభ్యులు

# ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలి ధర్నా

ప్రజాశక్తి - ఉండి

ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలు నిరాహారదీక్ష చేపట్టిన సంఘటన మహదేవపట్నం శివారు రామచంద్రపురంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కరణం నానాజీ రెండో కుమారుడు భాను ప్రకాష్ అదే ప్రాంతానికి చెందిన గంధం శ్రీను కుమార్తె దుర్గా భవానిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని పెద్దల సమక్షంలో అంగీకరించాడు. గత కొంతకాలంగా మొహం చాటేయడంతో దుర్గాభవాని న్యాయం చేయాలని భాను ప్రకాష్ ఇంటిముందు సోమవారం సాయంత్రం కుటుంబ సమేతంగా ధర్నాకు దిగింది. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ తనను భాను ప్రకాష్ ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని చెప్పాడని తెలిపింది. ఇంట్లో ఎనిమిది నెల క్రితం చేబ్రోలు గ్రామానికి చెందిన వ్యక్తితో తనకు వివాహం నిశ్చయించారని, అయితే భాను ప్రకాష్‌ను పెళ్లి చేసుకుంటానని చెప్పానని, పెద్దల సమక్షంలో భాను ప్రకాష్ తన తండ్రిని ఒప్పించాడని తెలిపింది. ఆరు నెల్లో తన అన్నకు పెళ్లి చేసిన తర్వాత భాను తనను పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో సంబంధం కుదుర్చుకున్నారని, అయితే, భాను ప్రకాష్ అన్నయ్యకు వివాహం కుదర్చకుండా దుబాయ్ పంపించేశారని, తన పరిస్థితి ఏంటని గత కొంతకాలంగా భాను ప్రకాష్‌ను నిలదీయగా నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. తనను వదిలించుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని, గత్యంతరం లేక భాను ప్రకాష్ ఇంటి ముందు ధర్నాకు దిగిన, తనకు న్యాయం చేయాలని దుర్గాభవాని వాపోయింది.

# రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేయాలి

## లోసరి గుట్లపాడు సొసైటీ పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పదవులు అలంకారప్రాయం కాదని, రైతుల సంక్షేమం, సొసైటీ అభివృద్ధికి కృషి చేయాలని టిడిపి పిఏసి ఛైర్మన్, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. లోసరి గుట్లపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం సోమవారం కొత్తపూసలమర్రులో నిర్వహించారు. ఛైర్మన్‌గా బొమ్మిడి మధుసూదనరావు, డైరెక్టర్లుగా బొడ్డు గోవిందరావు, పాపోలు అంజనేయులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ అంజిబాబు మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా త్రిసభ్య కమిటీ పని చేయాలన్నారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు తోట సీతారామలక్ష్మి, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, జనసేన జిల్లా అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు మాట్లాడుతూ త్రిసభ్య కమిటీ రైతులకు వెన్నుదన్నుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, సర్పంచులు, కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేస్తున్న లోసరి గొట్లపాడు సొసైటీ నూతన పాలకవర్గ సభ్యులు

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

# సమస్యలు పరిష్కరించాలని ఆర్‌డిఒకు వినతులు

ప్రజాశక్తి - నరసాపురం

21వ వార్డులో డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డిఒ దాసి రాజుకు సిపిఎం నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు బూడిద జోగేశ్వరరావు మాట్లాడుతూ 21వ వార్డు కొత్తకాలనీ ముద్దల వారివీధిలో డ్రెయినేజీ నుంచి మురుగు పారుదల లేకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని, వర్షాలు కురిసినప్పుడు ప్రజల అవస్థలు వర్ణనాతీతమని, డ్రెయినేజీ సమస్యతో ప్రతి రోజూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డ్రెయినేజీ నీరు ముందుకు సాగేవిధంగా లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహించడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. డ్రెయినేజీ కాలువ లేక సీజన్‌తో సంబంధం లేకుండా మురుగునీరు రోడ్డుపై నిత్యం ప్రవహిస్తూ ఉంటుందని, దుర్వాసన వెదజల్లుతోందని, దీంతో దోమలు విజృంభిస్తున్నాయని, దుర్వాసన వెదజల్లుతోందని, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మురుగు నీరు నిల్వ ఉండకుండా వెళ్లేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు నోముల కొండ, రామకృష్ణ, కొండ ధనలక్ష్మి, మణి అమ్మ, కొండ కళ్యాణి, ఎర్రమ్మ పాల్గొన్నారు.

**ఆదర్శనగర్‌లో మౌలిక వసతులు కల్పించాలి**

మొగల్తూరు: 12 సంవత్సరాలు గడుస్తున్నా మౌలిక వసతులకు దూరంగా ఆదర్శనగర్ కాలనీవాసులు ఉంటున్నారని సిపిఎం నాయకులు యడ్ల చిట్టిబాబు అన్నారు. సోమవారం నరసాపురం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆదర్శనగర్ కాలనీలో వసతులు కల్పించాలని కోరుతూ సోమవారం ఆర్‌డిఒ దాసి రాజుకు వినతిపత్రం అందించామని తెలిపారు. ఆదర్శనగర్ కాలనీలో సుమారు వంద కుటుంబాలు గృహాలు నిర్మించుకుని నివాసం ఉంటున్నాయన్నారు. కాలనీకి వసతులు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో మురుగు నీరు బయటకు వెళ్లేందుకు డ్రెయిన్ ఏర్పాటు చేయాలని ఆర్‌డిఒను కోరారు. ఈ కార్యక్రమంలో కొల్లాటి బాబూరావు, ఆదర్శనగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

# చిన్నారుల దాతృత్వం అభినందనీయం

ప్రజాశక్తి - ఉండి

చిన్నారులు విద్యార్థి దశలోనే సద్గుణాలు అలవర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని శశి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ ఖండాపు శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మహాదేవపట్నం గ్రామంలోని సన్‌రైజ్ ఫౌండేషన్ వృద్ధాశ్రమానికి చిన్నారుల దాతృత్వంతో పది వేల రూపాయల విరాళాన్ని ఫౌండేషన్ నిర్వాహకురాలు వాణికి శశి స్కూల్ తరపున అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యతోపాటు క్రమశిక్షణ ఎదుటివారిని గౌరవించే సద్గుణాలను ప్రతి ఒక్కరికి అలవాటు చేయడం జరుగుతుందన్నారు. నిరుపేదలను ఆదుకునేందుకు పాఠశాలలో డొనేషన్ బాక్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థుల పుట్టినరోజు సందర్భంగా ఆ బాక్స్‌లో తోచినంత నగదు డొనేట్ చేయాల్సిందిగా విద్యార్థులను కోరామని, వచ్చిన నగదుకు మరింత నగదు తాను చేర్చి ఆపదలో ఉన్న వారికి ఆదుకునేందుకు విరాళం అందజేయడం జరుగుతుందని తెలిపారు. వృద్ధాశ్రమానికి రూ.10 వేల నగదు విద్యార్థుల తరపున ఓల్డేజ్ హోమ్ నిర్వాహకులకు అందజేయడం జరిగిందని, చిన్నారులు చూపించిన ఈ దాతృత్వానికి అభినందనలు తెలుపుతున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో శశి స్కూల్ ఉపాధ్యాయులు ఉన్నారు.

వృద్ధాశ్రమానికి నగదు అందజేస్తున్న శశి స్కూల్ యాజమాన్యం

# విద్యుత్ పొదుపే లక్ష్యంగా కృషి చేయాలి

## కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ఒక యూనిట్ విద్యుత్ పొదుపు రెండు యూనిట్ల ఉత్పత్తితో సమానమని, విద్యుత్ పొదుపే లక్ష్యంగా కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రకాశం చౌక్‌లో చేపట్టిన ర్యాలీని కలెక్టర్ నాగరాణి జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ ప్రకాశం చౌక్ నుంచి పిపి రోడ్, మావుళ్లమ్మ టెంపుల్, తహశీల్దార్ కార్యాలయం మీదుగా ప్రకాశం చౌక్ వరకూ కొనసాగింది. అనంతరం ఇంధన పొదుపుపై అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యుత్ వినియోగం నానాటికీ పెరుగుతోందన్నారు. విద్యుత్ పొదుపే లక్ష్యంగా కృషి చేయాలని, భావితరాల దృష్ట్యా విద్యుత్ ఆదా చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా విద్యుత్ పొదుపుపై పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా విద్యుత్ శాఖ అధికారి పి.ఉషారాణి, ఇఇ వెంకటేశ్వరరావు, డిఇలు మధు కుమార్, నరసింహమూర్తి, విద్యుత్ సిబ్బంది, విష్ణు ఇంజినీరింగ్ కాలేజ్, భాష్యం స్కూల్, జిఐఎస్‌ఎన్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే పై శిక్షణ

ప్రజాశక్తి - ఆచంట

18 సంవత్సరాల్లోపు ప్రతి ఒక్కరూ ఇకెవైసి చేయించుకోవాలని ఎంపిడిఒ బి.కృష్ణమోహన్ పిలుపునిచ్చారు. సోమవారం ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, విలేజ్ రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బందికి ప్రభుత్వం నూతనంగా చేపడుతున్న యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ పరిధిలో ప్రతి కుటుంబమూ ఆర్థిక, విద్యా స్థితి గతులు, నివసించే గృహం సొంతం, అద్దె, విద్యార్హతలు, ఉపాధి వివరాలు వంటి సమాచారం ప్రత్యేక యాప్‌లో నమోదు చేసి ఆ కుటుంబంలో 18 ఏళ్లు పైబడిన సభ్యుని వివరాలు ఇకెవైసి ద్వారా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఒ వి.పూర్ణ బాబ్జీ, ఎంఇ ఒ.కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శులు, విలేజ్ రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా వైటి రాజా జయంతి

ప్రజాశక్తి - తణుకు

మాజీ ఎంఎల్‌ఎ వైటి రాజా జయంతి వేడుకలను సోమవారం తణుకులో ఘనంగా నిర్వహించారు. ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశాల మేరకు కూటమి నాయకులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తొలుత కూటమి కార్యాలయంలో వైటి రాజా చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. అనంతరం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పేదలకు ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్లో ఆహారం పంపిణీ చేసి సంధ్యా జ్యోతి వృద్ధాశ్రమంతో పాటు మానేపల్లి నారాయణమూర్తి వృద్ధాశ్రమంలో ఆహారం అందజేశారు. ఈ సందర్భంగా వైటి రాజా సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా రామరాజు పుట్టినరోజు

ప్రజాశక్తి - మొగల్తూరు

టిడిపి నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు పుట్టినరోజు వేడుకలను ముత్యాలపల్లిలో తెలుగు యువత ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు ఏర్పాటు చేసిన కేకులు టిడిపి మొగల్తూరు మండల అధ్యక్షులు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు గుబ్బల నాగరాజు కట్‌చేసి ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సమకూర్చిన విద్యాసామగ్రి, నోట్ పుస్తకాలను స్థానిక మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు అందించారు. అలాగే వికలాంగులకు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు నాగిడి రాంబాబు, బిసి సెల్ ఉపాధ్యక్షులు దొంగ శ్రీను, తిరుమాని భాస్కరరావు, నేతలు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు సిఎం రిలీఫ్ ఫండ్ అందజేత

ప్రజాశక్తి - పెనుగొండ రూరల్

ఇటీవల విద్యుత్ షాక్ కారణంగా ప్రమాదానికి గురైన సిద్ధాంతం శివారు నక్కవారిపాలెం గ్రామానికి చెందిన తాడి సుబ్బారావుకు సిఎ సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2,28,676 చెక్కును ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ కుమ్ముచిక్కాలలోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ మాట్లాడుతూ ప్రమాదాలు, ఆరోగ్య రీత్యా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. బాధిత కుటుంబానికి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించడం ప్రభుత్వం బాధ్యతగా భావిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో బొబ్బిలి శ్రీను, లక్కు వర్మ, కౌరు శ్రీరామ్మూర్తి, కడలి సత్యనారాయణ, కట్ల చిన్న శీను పాల్గొన్నారు.

# మెళకువలతో సాగుచేస్తే అధిక దిగుబడి

ప్రజాశక్తి - నరసాపురం

దాళ్వాలో రైతులు మెళకువలతో సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించొచ్చని ఉండి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు మల్లికార్జునశర్మ, వినయలక్ష్మి తెలిపారు. సోమవారం చిట్టవరంలో రైతు సేవా కేంద్రంలో 32 మంది రైతులకు ఉచితంగా 3238 రకం వరి విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ అధిక దిగుబడినిచ్చే, చీడపీడలను తట్టుకునే రకాల విత్తనాలను రైతులకు అందిస్తున్నామన్నారు. ఖరీఫ్ సీజన్‌లో మెరుగైన సాగును ప్రోత్సహించడం, రైతులకు ఆర్థిక భారం తగ్గించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు.

# వ్యవసాయ రుణాలు అందించాలని వినతి

ప్రజాశక్తి - నరసాపురం

రైతు పోరాట నాయకులు కూనపరెడ్డి వీర వెంకట విజయ రంగారావు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. రైతులు కో-ఆపరేటివ్ సొసైటీలో వ్యవసాయ పంట రుణం కోసం తీసుకునే దానిపై షేర్ క్యాపిటల్ పేరుతో 10 శాతం మినహాయించుకుని ఇవ్వడం వల్ల రైతులకు పూర్తిస్థాయిలో లబ్ధి చేకూరడం లేదనిఆవేదన వ్యక్తం చేశారు. షేర్ క్యాపిటల్ మినహాయించుకోకుండా పూర్తిస్థాయిలో రైతులకు రుణం అందజేస్తే వారికి న్యాయం చేకూరుతుందన్నారు. ఈ విషయాన్ని కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు పూర్తిస్థాయిలో న్యాయం చేకూర్చాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

# లంకలకోడేరులో రూ.250 కోట్లతో సబ్ స్టేషన్

## మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు

నియోజకవర్గంలో రూ.250 కోట్లతో 220/33 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైనట్లు జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. పాలకొల్లులోని మంత్రి కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం పాలకొల్లుకు కావాల్సిన విద్యుత్ భీమవరం, నరసాపురం నుంచి వస్తోందని, ప్రకృతి వైపరీత్యాల వల్ల విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతోందని చెప్పారు. ఇప్పటికే లంకలకోడేరులో స్థలం దొరికిందని చెప్పారు. 1999లో చంద్రబాబు తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణల వల్లే 16 శాతానికి ఉన్న విద్యుత్ నష్టాలు 5 శాతానికి తగ్గాయని మంత్రి చెప్పారు. 2014-19లో విద్యుత్ వినియోగం, ఒల్టేజీని తగ్గించేందుకు ఇంటింటికీ ఎల్ఇడి బల్బులు, ఫ్యాన్లు సబ్సిడీపై ఇచ్చిన ఘనత చంద్రబాబుదే అన్నారు. గత వైసిపి పాలనలో 11 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచితే, నేడు కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు తగ్గించిందన్నారు. భవిష్యత్తులో వినియోగదారులు కరెంటు బిల్లులు చెల్లించనవసరం లేకుండా ఎదురు విద్యుత్ సంస్థ నుండే ఆదాయం వచ్చేలా సూర్యఘర్ కార్యక్రమం తీసుకున్నట్లు చెప్పారు. వైసిపి ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిందని విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, విద్యుత్ శాఖ ఇఇ మధుబాబు, డిఇ రామకృష్ణ, ఎఇ బాబ్జీ, శ్రీనివాస్, బోనం చినబాబు, కూటమి నేతలు పాల్గొన్నారు.

# పెదఅమిరంలో వైసిపి ర్యాలీ

**కాళ్ల:** నిరుపేద విద్యార్థులు డాక్టర్లు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించే ఆలోచనలను కూటమి ప్రభుత్వం అడ్డుకుంటోందని వైసిపి జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు అన్నారు. సోమవారం పెదఅమిరం పార్టీ కార్యాలయం నుండి నియోజవర్గాల నుండి వచ్చిన కోటి సంతకాల ప్రతులను కేంద్ర పార్టీ కార్యాలయానికి పంపే కార్యక్రమంలో భాగంగా పార్టీ శ్రేణులతో భారీ ర్యాలీగా బయలుదేరారు. నరసాపురం పార్లమెంటరీ పరిశీలకులు ముదునూరి మురళీ కృష్ణంరాజు, ఎంఎల్‌సి కౌరు శ్రీనివాస్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు, మాజీ ఎంఎల్‌ఎలు కారుమూరి వెంకట నాగేశ్వరరావు, కొట్టు సత్యనారాయణ పాల్గొన్నారు.

# పేద విద్యార్థికి రోటరీ క్లబ్ సాయం

**పాలకొల్లు :** పేద మెరిట్ విద్యార్థులకు అందరూ తోడ్పాటు అందించాలని రోటరీ క్లబ్ అధ్యక్షుడు కోసూరు రామకృష్ణ ఆనంద రాజు అన్నారు. స్థానిక ప్రయివేటు కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న పెదమామిడిపల్లి గ్రామానికి చెందిన పేద మెరిట్ విద్యార్థిని కుక్కల యామిని సత్యలక్ష్మికి ఫీజు నిమిత్తం రూ.7,500 స్కాలర్షిప్ సోమవారం అందించి మాట్లాడారు. కార్యక్రమంలో క్లబ్ పూర్వాధ్యక్షుడు షేక్ పీర్ సాహెబ్, కార్యదర్శి పోతాబత్తుల శ్రీనివాస్, కోశాధికారి గన్నాబత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# అమరజీవి పొట్టి శ్రీరాములు ఆదర్శనీయులు

## వర్ధంతి కార్యక్రమంలో కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

అమరజీవి పొట్టి శ్రీరాములు ఆదర్శనీయులు, చిరస్మరణీయులని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. కలెక్టరేట్లో సోమవారం పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి కలెక్టర్ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తమిళనాడు రాష్ట్రం మద్రాసులో జన్మించారని తెలిపారు. స్వాతంత్ర ఉద్యమాలలో చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు. తొలుత జెసి టి.రాహుల్ కుమార్‌రెడ్డి, డిఆర్ఒ బి.శివన్నారాయణ రెడ్డి, పలువురు జిల్లా అధికారులు, జిల్లా కలెక్టరేట్‌లోని శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డ్వామా పీడీ కెసిహెచ్.అప్పారావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎన్‌వి.అరుణకుమారి, బిసి సంక్షేమ శాఖ అధికారి ఎవి.సూరిబాబు, కలెక్టరేట్ ఎఒ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

**గణపవరం:** గణపవరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక వెలంపేటలోని పాఠశాలకు శ్రీరా ములు వర్ధంతి సందర్భంగా 5 కుర్చీలు, ఆఫీస్ ఛైర్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు వెల్లంకి నరేష్, కిలారి రవిబాబు అందజేశారు. కోశాధికారి కెఎస్ఎన్.మూర్తి పాఠశాల హెచ్ఎం శివనారాయణ, అధ్యాపకులు నరేష్, లక్ష్మి పాల్గొన్నారు.

ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం తన ప్రాణాలను అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సభను స్థానిక డిగ్రీ కాలేజీలో ఘనంగా నిర్వహించారు. అలాగే సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి శ్రీరాములు, పటేల్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. లెక్చరర్లు కెవి.గణేష్ వెంకటరమణ, జి.వెంకట్రావు, బి.శారదాదేవి, సిహెచ్ అనూరాధ పాల్గొన్నారు.

**పాలకొల్లు :** ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు, చరిత్ర విభాగాల ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సభ నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి బూసి వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి హాజరై మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, ఐక్యూ ఎసి కో ఆర్డినేటర్ కె.భద్రాచలం, అకాడమిక్ కోఆర్డినేటర్ వి.యామిని, స్టూడెంట్ కౌన్సిల్ కన్వీనర్ సిహెచ్.ఉషారాణి పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం :** అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విశ్వవిద్యాలయ ఉపకులపతి కె.ధనుంజయరావు విచ్చేసి అమరజీవికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు గొప్ప గాంధేయవాది అన్నారు. ఆయన చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, పరీక్షల నియంత్రణాధికారి ప్రసన్న కుమార్, యాజమాన్యం పాల్గొన్నారు.

# బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - పాలకొల్లు

చట్ట సభల్లో బిసిలకు రాజకీయ రిజర్వేషన్లు 50 శాతం శాతం అమలు చేయాలని, స్థానిక సంస్థల్లో 42 శాతం, సంచార జాతులకు 10 శాతం కలిపి మొత్తం 52 శాతం రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలని పాలకొల్లులో సమావేశంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం సమావేశం డిమాండ్ చేసింది. పెంచిన రిజర్వేషన్లు ఎ, బి, సి, డిలుగా విభజించి అమలు చేయాలని సభకు అధ్యక్షత వహించిన ఆర్.కృష్ణయ్య, జాతీయ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముద్దాడ గణేష్ భవాని యాదవ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గణేష్ భవాని మాట్లాడుతూ మన రాష్ట్రంలో 139 బిసి కులాలుగా ఉంటూ కుల, చేతి వృత్తులు, సంచార జీవితాలు గడుపుతున్న దారిద్రరేఖకు దిగువన ఉన్న బిసి కులాలకు, చట్ట సభలో రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతున్నామని తెలిపారు. అనంతరం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులుగా పిల్లా నివాస్, రాష్ట్ర జనరల్ సెక్రటరీగా దాసరి చిన్నం నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా కోడె యుగంధర్, తాడివాడ రమేష్‌బాబు, కావేటి అనిల్ కుమార్ యాదవ్, రాష్ట్ర కార్యదర్శిగా గంటా వెంకన్న, రాష్ట్ర సోషల్ మీడియా, కన్వీనర్‌గా బుసే శివప్రసాద్, జిల్లా మహిళా అధ్యక్షురాలిగా రొంగల కృష్ణవేణి, కమిటీ సభ్యులతో గణేష్ భవాని ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ అధ్యక్షులు మూసే శ్రీనివాస్ యాదవ్, జిల్లా కార్మిక విభాగ అధ్యక్షులు శిడగం రవిశేఖర్, పొన్నమండ ముత్యాలరావు, ముక్క సత్యనారాయణ, పాలవలస నాగ విజయలక్ష్మి పాల్గొన్నారు.

# ఆంధ్రా జట్టుకు 32 మంది క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి - వీరవాసరం

జాతీయస్థాయిలో సాఫ్ట్‌బాల్ పోటీల్లో రాష్ట్రం తరఫున ఆడేందుకు 32 మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శులు పిఎస్ఎన్.మల్లేశ్వరరావు, దాసరి సునీత సోమవారం తెలిపారు. దీనిలో బాలుర జట్టుకు 16 మంది, బాలికల జట్టుకు 16 మందిని ఎంపిక చేశారన్నారు. బాలుర జట్టులో జిల్లా నుండి నుండి ఉప్పే దుర్గారావు, తెల్లం మన్వత్‌శ్రీనిహార్, నారెడ్ల నవసంపత్, నూకల ప్రేమ్‌సాయిసిద్దు, శ్రీకాకుళం జిల్లా నుండి గేదల నానిబాబు, చింతాడ జస్వంత్, పైడి శరత్, విజయనగరం జిల్లా నుండి ముగిడి శేఖర్, ముచ్చి ఉదయ్‌కిరణ్, ముగడ రంజిత్‌కుమార్, గుంటూరు జిల్లా నుండి ఎం.భూపేంద్రకుమార్, ప్రకాశం జిల్లా నుండి అంగలకుర్తి అరుణ్‌కుమార్, తూర్పుగోదావరి జిల్లా నుండి మాగాపు బాల వీరబాబు, కడప జిల్లా నుండి పసల భవంత్ సాగర్, విశాఖపట్నం జిల్లా నుండి వి.తేజరామ్ ఉన్నారు. బాలికల జట్టుకు విజయనగరం జిల్లా నుండి కొంద్రు స్నేహ, కలిశెట్టి మన్విత, ఆర్.శ్రీవాణి, కొలుసు ఇందు, పశ్చిమగోదావరి జిల్లా నుండి లగు ఐశ్వర్య, ఆర్.రోజ్‌లైన్, బొల్లుబోయిన నాగశ్రావణి, తూర్పుగోదావరి జిల్లా నుండి బుడితి సుష్మ, జిబిఎస్.సలోమణి, వి.రాజశ్రీవల్లీ,కడప జిల్లా నుండి చాగలేటి వైష్ణవి, మళ్ల రమ్యశ్రీ, ప్రకాశం జిల్లా నుండి గుమ్మ కీర్తన, గుంటూరు జిల్లా నుండి బొజ్జా శ్రీలక్ష్మీ, శ్రీకాకుళం జిల్లా నుండి అన్నెపు జోత్స్న, అనంతపురం జిల్లా నుండి బోయ రాధిక ఎంపికైనట్లు తెలిపారు.

# గడువులోగా ఫిర్యాదులు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నరసాపురం

పిజిఆర్ఎస్‌లో అర్జీదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆర్‌డిఒ దాసిరాజు ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో అర్జీదారుల నుంచి 44 ఫిర్యాదులు స్వీకరించినట్లు ఆర్‌డిఒ తెలిపారు. ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలన్నారు. వివిధ శాఖల డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

**మొగల్తూరు:** మొగల్తూరులోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఒక వినతి అందిందని తహశీల్దార్ కె.కిషోర్ తెలిపారు. శేరేపాలెంలోని భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతి అందిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి, ఎంఇఒ యు.శామ్యూల్ జాన్, ఎఒ అబ్దుల్ రహీం, అధికారులు పాల్గొన్నారు.

**తాడేపల్లిగూడెం :** తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెండు అర్జీలు స్వీకరించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు తెలిపారు. పబ్లిక్ హెల్త్‌కు ఒకటి, ఇంజినీరింగ్ విభాగానికి ఒక అర్జీ స్వీకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రతి సోమవారమూ ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికను పట్టణ ప్రజలు వినియోగించుకోవాలన్నారు. మున్సిపాల్టీకి చెల్లించాల్సిన కుళాయి, ఇంటి పన్నులను సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ ఇంజినీర్ వై.వెంకటరమణ, మేనేజర్ రవిసుధాకర్ పాల్గొన్నారు.

# కొమ్ముగూడెం గ్రేడ్ -1 కార్యదర్శిగా నాగదేవి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కొమ్ముగూడెం గ్రామ పంచాయతీ నూతన గ్రేడ్-1 కార్యదర్శిగా సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి తాడేపల్లి బేబీ, కూటమి నాయకులు తాడేపల్లి శ్రీను గ్రేడ్ వన్ కార్యదర్శిగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన డి.నాగదేవిని పుష్పగుచ్ఛాలతో అందించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇంతవరకూ ఇక్కడ కార్యదర్శిగా పనిచేసి బదిలీపై వేరే ప్రాంతానికి వెళున్న కార్యదర్శి వాణిని గ్రామ సర్పంచి, గ్రామ పెద్దలు, అంగన్వాడీలు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

# సాబ్జీకి నివాళి

ప్రజాశక్తి - వీరవాసరం

యుటిఎఫ్ దివంగత నేత, టీచర్స్ ఎంఎల్‌సి సాబ్జీ 2వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం యుటిఎఫ్ వీరవాసరం మండల శాఖ అధ్వర్యంలో నేతలు నివాళులర్పించారు. యుటిఎఫ్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఉపాధ్యాయ రంగానికి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.ప్రసాద్‌బాబు, బి.అచ్చయ్య, ఎం.గుర్గారావు, మల్లుల పెద్దిరాజు, పి. హరేకృష్ణ, జివి. రమణలు పాల్గొన్నారు.

## నోటీసు

**మహారాజశ్రీ కొవ్వూరు అడిషనల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కొవ్వూరు**

**O.S.No.171/2004**

కోయ మాధవరావు ...వాది

మరియు

కోయ లక్ష్మీబాయి వగైరాలు ...ప్రతివాద్లు

టు.

7. కోయ మధుసూదన ప్రసాద్ S/o. (లేటు) సుబ్బారావు, C/o. Padma Nursing Home, Near Menta Vari Satram, Powerpet, Eluru.
8. కోయ శ్రీనివాసరావు S/o. (లేటు) సుబ్బారావు, C/o. Padma Nursing Home, Near Menta Vari Satram, Powerpet, Eluru.
9. ముత్యాల పద్మజ W/o. రామసుబ్బారావు, Gandredu Gollalamamidada Mandal, E.G.Dt.

పై నెంబరు దావాలో 7 టు 9 ప్రతివాద్లు అయిన మీకు ఎన్నిసార్లు దావా సమనులు పంపించు చున్ననూ మీరు బుద్ధి పూర్వముగా తీసుకొనకుండా నిలువరించుచున్నందున శ్రీ కోర్టువారు సబ్‌స్టిట్యూట్ సర్వీస్ ద్వారా అమలు చేయమని ఆర్డరు వేసినందున, యీ ప్రకటన ద్వారా మీకు వాయిదా తెలియజేయడమైనది.కావున ది.31-12-2025వ తేది ఉదయం గం॥10.30ని॥లకు మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా అయి వున్నది. ఆరోజున మీరు స్వయంగా గాని లేదా మీ ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించడమగును.

**వాయిదా తేది.31-12-2025**

**MADDIPATI SRINIVAS**
Advocate,Kovvur.
Cell.9346650165